క్లుప్తంగా

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న డ్రగ్ అండ్ కెమిస్ట్ యూనియన్ సభ్యుడు

హిందూపురం: ఆల్ ఇండియా డ్రగ్ అండ్ కెమిస్ట్ ఫౌండర్ జగన్నాథ్‌షిండే జన్మదినం సందర్భంగా డ్రగ్ అండ్ కెమిస్ట్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం హిందూపురం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఆఫీసు వద్ద రక్తదానం నిర్వహించారు. ప్రజల ఆరోగ్య భద్రత కోసం తమ వంతు కృషి చేస్తున్నామని ఆ సంఘం నాయకులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా డ్రగ్ అండ్ కెమిస్ట్ సంఘం అధ్యక్షుడు శివకుమార్, కార్యదర్శి నాగరాజు, కోశాధికారి అనిల్, అజంతుల్లా, రాజేష్, శివప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సమాఖ్యల బలోపేతంతో ఆర్థికాభివృద్ధి



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న అధికారులు

హిందూపురం: మహిళా సమాఖ్యలను బలపేతం చేయడం వల్ల మహిళలు వారి కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేసుకోవచ్చని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు అన్నారు. మున్సిపల్ మెప్మా విభాగంలో అనంతపురం మెప్మా పీడీ, విభాగ సభ్యులు హాజరై మహిళా సంఘ సభ్యులు, ఆర్‌పీలకు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం, ఆర్థికాభివృద్ధిపై సూచనలు అందించారు. కార్యక్రమంలో మెప్మా టీఈ భవాని, హిందూపురం డీఎంసీఎల్ గంగులయ్య, డీఈఓ ఇబ్రహీం ఖాన్, సీఓలు పరంజ్యోతి, నాగేశ్వరి, వరలక్ష్మి, గంగరత్న, తాసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

సోమందేపల్లి: చేనేత వర్గానికి సంబంధించి కలర్ ఫ్యాక్టరీ నిర్వాహకుల కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లింగప్ప, ఉపాధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా కుమార్, సహాయ కార్యదర్శిగా రాజు, కోశాధికారిగా శ్రీనివాసులు, ట్రెజరర్‌గా సంజీవప్పలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలకు టీకాలు

అమరాపురం: మండలంలోని తమ్మడేపల్లి, దేవగానపల్లి గ్రామంలో గొర్రెలకు శుక్రవారం వీఏఏ శ్రీధర్ ఆధ్వర్యంలో టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొర్రెలు, మేకలు, ఎనుములు తదితర పశువులు ఉన్న పాడి రైతులు పశువులకు వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యాధి సోకిన వాటికి టీకాలు, మందులు ఇస్తున్నామన్నారు.

పేదలకు అన్నదానం

హిందూపురం: పేదలు, నిరాశ్రయులకు అన్నదానంతో దైవానుగ్రహం లభిస్తుందని యోగినారాయణ సేవా సమితి అధ్యక్షుడు రవిశంకర్ అన్నారు. సమితి ఆధ్వర్యంలో 179వ రోజు శుక్రవారం లేపాక్షిరోడ్డులో అన్నదానం చేపట్టారు. సుమారు 300 మందికి పైగా పేదలు, ప్రయాణికులకు అన్నదానం చేశామన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



అలంకరణలో సీతారాములు

హిందూపురం టౌన్: పట్టణంలోని సూరప్పకట్టకింద వాల్మీకి వీధిలో వెలసిన వాల్మీకి శ్రీరామ దేవాలయం ప్రథమ వార్షికోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ విగ్రహాల ధర్మకర్తలు వైఎస్‌బీ భాస్కర్, లక్ష్మీ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా పూజా కార్యక్రమాలు చేశారు. ఉదయం నుంచే ఆలయంలో స్వామి వారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరణల అనంతరం విశేష పూజలు నిర్వహించారు. అలాగే నవగ్రహ, మృత్యుంజయ, నక్షత్ర హోమాలు, శ్రీరామ రక్షస్తోత్ర హోమం, బలి, పూర్ణాహుతి, కుంభాభిషేకాలు నిర్వహించారు.



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

తడి.. పొడి.. లక్ష్యం తిరగబడి!



చోళసముద్రం వద్ద నిరుపయోగంగా ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం

- అలంకారప్రాయంగా చెత్త సంపద కేంద్రాలు
- రూ.లక్షలు ఖర్చు చేసినా పట్టించుకోని ప్రభుత్వం

లేపాక్షి: నియోజకవర్గంలోని నిర్మించిన చెత్తతో సంపద కేంద్రాలు అలంకారప్రాయంగా మారాయి. ఈ కేంద్రాలకు లక్షలాది రూపాయలు వెచ్చించినా కేంద్రాల నుంచి మాత్రం సంపదను సృష్టించడం లేదు. ఈ కేంద్రాలకు వచ్చిన మిషనరీ, వాహనాలు ఏమయ్యాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఎస్సీ కార్పొరేషన్ నుంచి జేసీబీ యంత్రాలు కూడా మంజూరు అయినట్లు చెబుతున్నారు. స్వచ్ఛభారత్ కింద గ్రామాల్లోని పరిసరాలను పరిశుభ్రం చేసి సేకరించిన తడి.. పొడి చెత్తను వేరు చేస్తారు. దీని ద్వారా ఎరువులను ఉత్పత్తి చేసి రైతులకు విక్రయించడం ద్వారా గ్రామ పంచాయతీలకు ఆదాయం చేకూర్చే ఉద్దేశంతో చెత్తతో సంపద తయారు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

11 కేంద్రాలు నిరుపయోగం

లేపాక్షి మండలంలోని 12 పంచాయతీల్లో ఒక్కో గ్రామ పంచాయితీకి ఒక్కోటి చొప్పున 12 చెత్తతో సంపద తయారు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒక్కో పంచాయతీకి జనాభా ప్రాతిపదికన రూ.3 లక్షల నుంచి రూ.7 లక్షల వరకూ నిధులు వెచ్చించి చెత్త కేంద్రాలను నిర్మించారు. అలాగే ఒక్కో పంచాయతీకి ముగ్గురు లేకపోతే నలుగురు గ్రీన్ అంబాసిడర్ల చొప్పున మండల వ్యాప్తంగా ఎంపిక చేశారు. అయితే గ్రీన్ అంబాసిడర్లు ప్రతి గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి పొడి చెత్త, తడి చెత్తను విడివిడిగా సేకరించి రిక్షాలు లేదా ట్రాక్టర్‌లు ద్వారా చెత్త కేంద్రాలకు తరలించాల్సి ఉంది. చెత్త కేంద్రాల వద్ద రెండు రకాల చెత్తను విడదీసి ఎరువులుగా తయారు చేయాల్సి ఉంది. ఈ ఎరువులను గ్రామ పంచాయతీ అధికారులు రైతులకు విక్రయించి వచ్చిన మొత్తాన్ని గ్రామ పంచాయతీల అభివృద్ధికి ఖర్చు చేయాల్సి ఉంది.

> గ్రామాల్లో మెరుగైన పారిశుధ్య నిర్వహణతో పాటు ఆర్థిక వనరులు మెరుగుపర్చాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన సంపద కేంద్రాలు అలంకార ప్రాయంగా మారాయి. సిబ్బంది కొరత, ఆర్థిక తదితర సమస్యలతో అవి నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..

ఉన్నత లక్ష్యంతో ఏర్పాటైన చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాలు ప్రస్తుతం దిష్టిబొమ్మల్లా దర్శనం ఇస్తున్నాయి. కొన్ని చోట్ల అసాంఘిక కార్యకలాపాలకు కూడా అడ్డాగా మారాయి. చెత్త సేకరణ సరిగ్గా నిర్వహించకపోవడంతో పలు గ్రామాలు మురికి కూపాలుగా మారాయి. అసలు కేంద్రాలే నిర్వహించకపోతే పంచాయతీలకు ఆదాయం ఎలా సాధ్యపడుతుందనే విమర్శలు సర్వాత్రా వినిపిస్తున్నాయి. చెత్తతో సంపద కేంద్రాలను ఉపయోగంలోకి తీసుకువచ్చి స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్ది పంచాయతీలకు ఆదాయం వచ్చే విధంగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని అన్ని వర్గాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

చెత్త ఎక్కడ బడితే అక్కడే..



ప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చించి చెత్త నుంచి సంపద కేంద్రాలను నిర్మించింది. ప్రస్తుత ప్రభుత్వం వాటిని పట్టించుకోకపోవడంతో అసాంఘిక కార్యాకలాపాలకు అడ్డాగా మారాయి. ఇప్పటికైనా వాటిని ఉపయోగంలోకి తీసుకురావాలి. ప్రభుత్వం పంపిణీ చేసిన రిక్షాలు, సైకిళ్లు, డస్ట్‌బిన్‌లు ఎక్కడా కనిపించడం లేదు. అంతేకాకుండా పంచాయతీలో ఎక్కడపడితే అక్కడ చెత్తను పారేస్తున్నారు. దీంతో గ్రామాలు అపరిశుభ్రంగా మారి వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది.

– శ్రీరామిరెడ్డి, మామిడిమాకులపల్లి, లేపాక్షి మండలం

వినియోగంలోకి తెస్తాం



మండల వ్యాప్తంగా నిరుపయోగంగా ఉన్న చెత్తతో సంపద కేంద్రాలను త్వరలో ఉపయోగంలోకి తెస్తాం. కొన్ని కేంద్రాల్లో మైనర్ రిపేరీలు ఉన్నాయి. వాటికి మరమ్మతులు చేయించి పునరుద్ధరిస్తాము. మండలంలోని పంచాయతీ కార్యదర్శులు అందరు చెత్త నుంచి సంపద కేంద్రాలపై ప్రణాళికలు సిద్ధంచేసి నివేదిక పంపాలని ఆదేశించాము. చెత్తను తరలించడానికి రిక్షాలు, ట్రాక్టర్లను ఉపయోగించుకోవడం జరుగుతుంది.

– నరసింహమూర్తి, ఎంపీడీఓ, లేపాక్షి

ఉపాధిహామీ పనులపై సమీక్ష

గుడిబండ: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏపీడీ లక్ష్మీనారాయణ ఉపాధి హామీ సిబ్బందితో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జరుగుతున్న పనుల గురించి సమీక్షించిన ఆయన వచ్చే వారం చేపట్టబోయే పనుల గురించి సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. హార్టికల్చర్‌పై అవగాహన కల్పించాలన్నారు. అలాగే ఉపాధి హామీలో పనిచేసి పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే రైతులకు, కూలీలకు వెంటనే చెల్లించేలా చూడాలన్నారు. ప్రతి కుటుంబానికి వంద రోజుల పనిని కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఓ భార్గవి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

రొళ్ల ఏఎస్‌ఐగా పి.గంగన్న



రొళ్ల: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్‌ఐగా పీ.గంగన్న శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. జమేదార్ రమణ, కానిస్టేబుళ్లు దిలీప్, షఫీ... ఏఎస్‌ఐ పి.గంగన్నకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు దినోత్సవంపై నేడు ర్యాలీ

రొళ్ల: మండల కేంద్రంలో 15వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఉదయం 10 గంటలకు అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ షేక్షావలి ఒక ప్రకటనలో తెలిపారు.

ఏపీజీబీ ద్వారా మెరుగైన సేవలు

రొళ్ల: స్థానిక ఏపీజీబీ బ్యాంక్‌ను శుక్రవారం ఆశాఖ కదిరి రీజినల్ మేనేజర్ రమేష్ సందర్శించారు. తొలుత రికార్డులు తనిఖీ చేసి బ్యాంక్ లావాదేవీలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం రమేష్ మాట్లాడుతూ వివిధ రకాల రుణాల కింద రూ.80 కోట్ల వరకూ రుణాలు ఇచ్చామన్నారు. బ్యాంక్ సిబ్బంది మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని సూచించారు.

ఘనంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ట



పూజల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక

చిలమత్తూరు: మండలంలోని పలగలపల్లిలో నూతనంగా నిర్మించిన రామాలయంలో సీతారామలక్ష్మణ సమేత విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. హోమాలు, అభిషేకార్చనలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు వేణురెడ్డి, ఎంపీపీ పురుషోత్తమరెడ్డి, మండల కన్వీనర్ ఎస్. రామకృష్ణారెడ్డి, సర్పంచ్ బందేపల్లి శంకర్ రెడ్డి, అన్సర్ అహ్మద్, రాష్ట్ర కురుబ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.శివ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



కార్యకర్త బాబురెడ్డిని పరామర్శిస్తున్న వేణురెడ్డి తదితరులు

చిలమత్తూరు: కార్యకర్తలకు అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గస్థాయి నాయకుడు వేణురెడ్డి భరోసా ఇచ్చారు. మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డితో కలసి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి కోలుకుంటున్న కందుర్పర్తికి చెందిన బాబురెడ్డి, వేణుగోపాల్‌రెడ్డిలను శుక్రవారం పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు అమరనాథరెడ్డి, అన్సర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్ఏసీ తహసీల్దార్‌గా వెంకటేష్

చిలమత్తూరు: మండల ఎఫ్ఏసీ తహసీల్దార్‌గా జి.వెంకటేష్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు ఈనెల 17న ఆయన బాధ్యతలు చేపట్టాల్సి ఉంది. వివిధ కారణాలతో వారం తర్వాత బాధ్యతలు చేపట్టారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.

రీసర్వే పనుల ప్రారంభం



తూభినకుంట వద్ద రీ-సర్వే పనులు ప్రారంభిస్తున్న రెవెన్యూ సిబ్బంది

రొళ్ల: మండల పరిధిలోని తూభినకుంట రెవెన్యూ పొలంలో శుక్రవారం రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో రీసర్వే పనులు ప్రారంభించినట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ షేక్షావలి తెలిపారు. తూభినకుంట రెవెన్యూ పొలం పరిధిలో 91 సర్వే నంబర్లకు గాను 701.58 ఎకరాల విస్తీర్ణం గల భూమి ఉందన్నారు. సమగ్ర భూ రీసర్వే చేసి రైతులకు భూ హద్దులు చూపించడం జరుగుతుందని పేర్కొన్నారు. రీసర్వే చేస్తున్న సర్వేయర్లు, వీఆర్వోలు, వీఆర్‌ఏలకు అన్ని విధాలుగా రైతులు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

27న చేపల చెరువు వేలం

మడకశిరరూరల్: మండల పరిధిలోని హరేసముద్రం పెద్ద చెరువులో చేపల పెంపకానికి 27వ తేదీ ఉదయం 10.30 గంటలకు గ్రామ సచివాలయంలో సర్పంచ్ కరియన్న సమక్షంలో వేలం పాట నిర్వహిస్తున్నట్లు గ్రామ కార్యదర్శి టీ రాకేష్ తెలిపారు. వేలం పాటలో పాల్గొనేవారు రూ.10 వేల డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు.

రైతులను నట్టేట ముంచారు

- కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ ఆగ్రహం



సానిపల్లిలో కందులు పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్

రొద్దం: 'రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. అధికారం కోసం రైతులను నమ్మించి నట్టేట ముంచారు'. అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉషాశ్రీచరణ్ మండిపడ్డారు. శుక్రవారం మండలంలోని సానిపల్లిలో 'కాఫీ విత్ వైఎస్సార్‌సీపీ లీడర్స్' కార్యక్రమం నిర్వహించారు. ఉదయాన్నే గ్రామానికి చేరుకున్న ఉషశ్రీచరణ్.. వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి విస్తృతంగా పర్యటించారు. గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం పనితీరును ప్రజలతో అడిగి తెలుసుకున్నారు. రైతులు పండించిన కంది పంటను ఆమె పరిశీలించడంతో పాటు మార్కెట్ ధరలపై ఆరాతీశారు. అనంతరం ఉషశ్రీచరణ్ విలేకరులతో మాట్లాడుతూ అరకొరగా పండిన కంది పంటకు మద్దతు ధరలేక పండిన పంటను సైతం రైతులు కల్లాలోనే రాసులు పోసుకున్నారన్నారు. మద్దతు ధర లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కందులు క్వింటాలుకు రూ.10 వేలు మద్దతు ధర కల్పించి, ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. గతంలో అన్ని రకాల సేవలు ఆర్‌బీకేల్లో అందేవన్నారు. ఏటా రూ.13,500 చొప్పున పెట్టుబడి సాయాన్ని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇచ్చేదని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం రూ. 20 వేలు ఇస్తామని ఎన్నికల్లో ప్రకటించి నేటికీ నయాపైసా ఇవ్వలేదన్నారు. నాడు ఉచిత పంట బీమా అమలు చేసి రైతులను ఆదుకుంటే.. నేడు చంద్రబాబు ఆ పథకానికి ఏకంగా ఎసరు పెట్టారని ధ్వజమెత్తారు. ప్రస్తుతం రైతుల పరిస్థితి దయనీయంగా ఉందని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ భర్త శ్రీచరణ్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు శంకర్‌రెడ్డి, సదాశివరెడ్డి, రొద్దం, పెనుకొండ మండల కన్వీనర్లు బి.తిమ్మయ్య, సుధాకర్‌రెడ్డి, జిల్లా యాక్టివిటీ సెక్రటరీ నరేంద్రరెడ్డి, సోమందేపల్లి జెడ్పీటీసీ సభ్యుడు అశోక్, నాయకులు సి.నారాయణరెడ్డి, చిలకల రవి, ఎస్ నారాయణరెడ్డి, నరసింహులు, కంబాలప్ప, లక్ష్మీనారాయణరెడ్డి, స్థానిక నాయకులు గోపాల్‌రెడ్డి, నాగేంద్ర, జెట్టి శ్రీనివాస్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నూతన గ్రామ కమిటీ ఎన్నిక

మండల పరిధిలోని సానిపల్లిలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ ఆధ్వర్యంలో పార్టీ నూతన గ్రామ కమిటీని ఎంపిక చేశారు. పంచాయతీ అధ్యక్షుడిగా వి.రమేష్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా పెద్దిపల్లి గంగాధర్, యుత్ కమిటీ అధ్యక్షుడిగా హనుమతరాయుడు, ఉపాధ్యక్షుడిగా పెద్దిపల్లి అనిల్, రైతు సంఘం అధ్యక్షుడిగా పెద్దిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా కుమ్మర చిరంజీవి, మహిళా అధ్యక్షురాలిగా సి.పద్మావతి, ఉపాధ్యక్షురాలిగా కురుబ సునీత, భూత్ కమిటీ అధ్యక్షుడిగా వీరాంజి, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసులు, సోషల్ మీడియా అధ్యక్షుడిగా ఇ. క్రిష్టప్ప, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసులు, బీసీ సెల్ అధ్యక్షుడిగా దేవరాజ్, ఉపాధ్యక్షుడిగా ఇ.రామాంజి, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా గంగాధర్, ఉపాధ్యక్షుడిగా ఎల్ఎల్ గంగాధర్ తదితరులతో కమిటీ ఏర్పాటు చేసినట్లు ఆమే వివరించారు.

పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి



ఉషశ్రీచరణ్ సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అగళి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని మాధుడి గ్రామంలో పర్యటించి మాజీ కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ బిదురమ్మ చంద్రప్ప నివాసంలో విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన మేలును ప్రజలకు వివరిస్తూ.. కూటమి సర్కారు వైఫల్యాలను ఎండగట్టాలన్నారు. కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మహేంద్రప్ప, కో ఆప్షన్ సభ్యుడు నాసిర్, సర్పంచ్ కృష్ణప్ప, నాయకులు గంట నాగరాజు, సురేష్, లింగరాజు, సుర్యనారయణరెడ్డి, గోవిందప్ప, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాలికలు ఉన్నత స్థాయికి ఎదగాలి



పెనుకొండ: ర్యాలీ నిర్వహిస్తున్న బాలికలు



రొళ్ల: మాట్లాడుతున్న హెచ్ఎం యంజారప్ప



లేపాక్షి: ప్రతిజ్ఞ చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

రొళ్ల: బాలికలు బాలురకు ధీటుగా అన్ని రంగాల్లోనూ ముందుకెళ్లి ఉన్నత స్థాయికి ఎదగాలని హెచ్ఎం యంజారప్ప పేర్కొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం మండల పరిధిలోని బీజీ హళ్లి ఉన్నత పాఠశాల ఆవరణలో జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. హెచ్ఎం యంజారప్ప మాట్లాడుతూ బాలికలు క్రమ శిక్షణతో కూడిన చదువుతో పాటు క్రీడలు తదితర వాటిలో రాణించాలన్నారు. తల్లిదండ్రులు కూడా బాలికలను ఇంటి పనులకు పరిమితం చేయకుండా ఉన్నత చదువులు చదివించి బంగారు భవిషత్తుకు బాట వేయాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సన్నమ్మ, ఉపాధ్యాయులు, అంగనవాడీ వర్కర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్: జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా ఆర్డీటీ, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. గాంధీ విగ్రహం వద్ద బాలికలు మానవహారంగా ఏర్పడి బాలిక పరిరక్షణ అందరి బాధ్యత అంటూ నినాదాలు చేశారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నేటితరం బాలికలు సెల్‌ఫోన్‌లో చిన్న చిన్న సరదాల కోసం జీవితాలను చీకట్లోకి నెట్టుకుంటున్నట్లు పేర్కొన్నారు. తల్లితండ్రుల కష్టాన్ని గుర్తించి ప్రతి ఒక్కరూ కష్టపడి చదువుకొని ఉన్నతస్థాయికి చేరాలన్నారు. బాలికలను వేధింపులకు గురిచేస్తే పోక్సో కేసులు తప్పవన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యనేరమని, ఎక్కడైన బాల్యవివాహాలు జరిగితే, టోల్ ఫ్రీ నంబర్ 100, 1098కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీటీ రీజనల్ కోఆర్డినేటర్ మల్లికార్జున, సీడీపీఓ శాంతలక్ష్మి, ప్రిన్సిపాల్ జ్యోతిలత, అంగన్వాడీ కార్యకర్తులు తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం: కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన సుకన్య సమృద్ధి యోజన పథకం బాలకల అభ్యుదయానికి ఎంతో దోహదపడుతుంది. అందరూ సద్వినియోగం చేసుకోవాలని పోస్ట్‌మాస్టర్ మార్కండేయ అన్నారు. జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా శుక్రవారం హెడ్ పోస్టాఫీసులో సుకన్య సమృద్ధి యోజన ఖాతాలను ప్రారంభించారు. పట్టణ సీఐలు జనార్దన్, ఆంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ పథకం ఆడపిల్లలకు ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. కార్యక్రమంలో పోస్టల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి: బాల్యవివాహ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఐసీడీఎస్ సీడీపీఓ శాంతమ్మ తెలిపారు. శుక్రవారం ఉదయం స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలపై అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. అనంతరం వారిచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నీలిమా, సూపర్‌వైజర్లు శ్రీలక్ష్మి, మంజుల, మహిళా పోలీస్ ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.

అగళి: బాలికల సర్వతోముఖాభివృద్ధితోనే దేశ పురోగతి సాధ్యమని సీడీపీఓ నాగమల్లేశ్వరి అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. సీడీపీఓ నాగమల్లేశ్వరి మాట్లాడుతూ.. బాలికల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరం దిశగా అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ లీలవతీ, తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ: బాలికలు తమకు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పరిటాల శ్రీరాములు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు పేర్కొన్నారు. పట్టణంలోని డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ జయప్ప, రామన్న తదితరులు పాల్గొన్నారు.

పోతగానహళ్లి అధ్యక్షురాలిగా మంజుల



మంజులను సన్మానిస్తున్న దృశ్యం

పావగడ: తాలూకాలోని పోతగానహళ్లి గ్రామ పంచాయతీ అధ్యక్షురాలిగా మంజుల ఘన విజయం సాధించింది. గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన అధ్యక్ష స్థానం ఎన్నికలో కాంగ్రెస్ పార్టీకి చెందిన సభ్యురాలు మంజుల జేడీఎస్ అభ్యర్థి అశ్వినిపై 15 ఓట్ల మెజారిటీతో గెలుపొందింది. ఎన్నికల అధికారి తహసీల్దార్ వరదరాజు.. మంజుల గెలుపును ధృవీకరించారు.